అన్ని మతాల విశ్వాసాలను సమానంగా ఆదరిస్తాం

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల వారి విశ్వాసాలను సమానంగా ఆదరిస్తుందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓలీవ చర్చిలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు ఉత్సవాలు నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలోని మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం కేక్ కట్ చేసి పాస్టర్లతో కలిసి మిఠాయి తినిపించుకున్నారు. అనంతరం క్రైస్తవులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ మహేశ్, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, క్రిష్టియన్ సంఘాల ప్రతినిధులు ప్రసాద్, జయానంద్, జానప్ప, బెంజమిన్, రోనాల్డ్, సుకన్య ఉన్నారు.

ప్రాజెక్టుకు భూమిలిచ్చిన రైతులను విస్మరించొద్దు

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

జూరాల మోటర్ల వద్ద పూజలు చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, డిసెంబర్ 23 : జూరాల ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని, ఈయాసంగిలో ఈ ప్రాంత రైతుల భూములకు చివరి తడి వరకు సాగునీరు పారిన తర్వాతే దిగువకు సాగునీటిని విడుదల చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నందిమల్ల డివిజన్ డీఈ నారాయణను ఆదేశించారు. జూరాల ప్రాజెక్టుపై ఎడమకాల్వ సాగునీటిని విడుదల చేసే మోటర్లకు సోమవారం ఆయన పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు జూరాల ప్రాజెక్టులో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నా ఎడమకాల్వ ద్వారా దిగువకు నీటిని వదిలి ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలను గాలికి వదిలేస్తుదన్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈప్రాంత రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని యాసంగిలో పంటల చివరి తడి వరకు సాగునీటి విడుదల చేయాలని, అందుకోసం అవసరమైతే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు భారీ నీటిపారుదల శాఖ ప్రత్యేక అధికారి రాయల్‌బొజ్జతో మాట్లాడుతానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట టీపీసీసీ కల్లు గీతా కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి, అయ్యూబ్‌ఖాన్, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఆర్‌వో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు జున్ను వెంకటనారాయణ ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం జిల్లాస్థాయి సీఎం కప్ విజేతలకు బహుమతులు అందజేశారు.

అన్ని మతాలకు ప్రభుత్వ ప్రాధాన్యం

కొత్త కోట, డిసెంబర్ 23: రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తున్నదని, అందులో భాగంగా క్రైస్తవులకు పెద్దపీట వేస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంబీ చర్చిలో సోమవారం ముందస్తుగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రశాంత్, బోయేజ్, నాగభూషణ్, మిషేక్, భాస్కర్, కృష్ణారెడ్డి, బీచుపల్లి, అమ్మపల్లి బాలకృష్ణ, నరేందర్ రెడ్డిపాల్గొన్నారు.

అలంపూర్ కోర్టులో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అలంపూర్, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కర్నూలు మెడికవర్ దవాఖాన వారు సోమవారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయమూర్తి కూడా వైద్య శిబిరాన్ని సద్వినియోగ పర్చుకున్నారు. వారికి వైద్య సిబ్బంది బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మిథున్ తేజ మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ తమ వంతుగా సేవ భావం కల్గి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మెడికవర్ దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో సుజాత

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 23 : గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో సుజాత అన్నారు. సోమవారం ఉండవెల్లి, మానవపాడు, రాజోళి, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు పోషణ్ ట్రాకర్‌లో అటెండెన్స్, చిన్నారుల ఎదుగుదలను ఎంట్రీ చేయాలని సూచించారు. అలాగే పోషణ్ ట్రాకర్‌లో కొత్తగా వచ్చిన ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ఇచ్చేటప్పుడు ఫొటో ఎలా తీయాలి, ఈ కేవైసీ ఎలా అప్‌లోడ్ చేయాలనే విషయాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, GOWNI SWAPNA KUMARI (Before Marriage), R/o. 2-4-25/2, Bhavani Nagar, Jogulamba Gadwal-509 125, TS. After Marriage My Name as Changed to NAIKI KAVITHA, W/o. Naiki Madan Mohan.
NT-327432

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. వసతి గృహ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, బ్లాంకెట్లు, స్వెటర్లు, రింగ్ బాల్స్, చెస్ మెటీరియల్స్‌తోపాటు పలు ఆటవస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు, సదుపాయాలను చక్కగా వినియోగించుకొని ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా వంట గదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడానికి ముందు సూపర్‌వైజర్లు తినాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. హాస్టల్‌లో స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసిన కలెక్టర్, మెస్ కమిటీ ఉందా అని సిబ్బందిని అడిగారు. వసతి గృహానికి వంట సామగ్రి వచ్చినప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో విద్యార్థులతో సంతకం చేయించాలని సూచించారు వంట సామగ్రి వచ్చినప్పుడు ఆది నాణ్యతగా ఉందో లేదో చెక్ చేసిన తర్వాతనే దించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు గంధం నాగరాజు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 40 అర్జీలు వచ్చాయని, ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపేలా ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్‌లో ఉన్న అర్జీలను సైతం వారం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

సర్వే వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి : అదనపు కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే వేగంగా పూర్తయ్యేలా మండలాల ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రత్యేక అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టి సర్వే వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, సర్వే నెమ్మదిగా జరుగుతున్న చోట ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి కావాలని, ప్రతిరోజూ ప్రతి సర్వేయర్ 25 ఇండ్లను సర్వే చేయడం లక్ష్యంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తాసీల్దార్లు, ఎంపీవోలు తదితరులు ఉన్నారు.

రైతు బాగుంటేనే రాజ్యం బాగు

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న భవిష్య భారత్ సంస్థ ప్రతినిధులు, నాయకులు

గట్టు, డిసెంబర్ 23 : రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరాజు అన్నారు. మండలంలోని బలిగేరలో సమగ్ర గ్రామీణ అభివృద్ధి(ఐవీడీపీ)లో భాగంగా ఎల్‌టీఐ మైండ్ ట్రీ సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రైతుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రఘు, నాయకులు గోపాల్, భవిష్య భారత్ లైవ్లీహుడ్ అధికారులు వెంకటేశ్వర్లు, హరికృష్ణ, సీవోలు హలీమ్‌పాషా, లక్ష్మన్న, ప్రతాప్, పార్వతి, పరమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 :మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను జీహెచ్ఎం గణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈవో మద్దిలేటి జిల్లా చెలిమి సంస్థ అధ్యక్షుడు రవిసాగర్ హాజరయ్యారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని భార్గవి తల్లిదండ్రులు, ఆదర్శ రైతులు సుజాత, కిషన్‌లను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిరాజాచారి, పీఎస్ హెచ్ఎం వరదాచారి, షఫి, శ్రీనివాసులు, సుచరిత, జితేందర్, శోభ, శిరీష ఉన్నారు.

కొత్తకోట మండలంలో..

కొత్త కోట, డిసెంబర్ 23 : మండలకేంద్రంలోని ప్రజ్ఞా జ్యోతి పాఠశాలలో రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. దేశానికి రైతు వెన్నముక లాంటి వాడని, రైతు లేనిదే మానవ మనుగడ లేదని, వారు పండించే పంటలే మన జీవనాధారానికి కారణమని ప్రిన్సిపాల్ అంజిరెడ్డి అన్నారు. మొక్కై వొంగనిదే మానై వొంగునా.. అనే నానుడిని రైతు కష్టాన్ని పిల్లలకు ఎంతో చక్కగా వివరించి, విద్యార్థులకు విద్యతో పాటు చిన్న వయస్సు నుంచే మన సాంప్రదాయాలు, మన సంస్కృతుల మీద అవగాహన వచ్చేలా నేర్పించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో పిల్లలతో మొక్కలను నాటించారు.

తాజా కూరగాయలతో వంట వండాలి

ధరూరు, డిసెంబర్ 23 : విద్యార్థులకు వండే ఆహారంలో ఎప్పటికప్పుడు తాజా కూరగాయలే వినియోగించాలని ఎంఈవో రవీంద్ర బాబు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం సందర్శించి విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని భుజించారు. ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను వినియోగించి వంట వండాలని సూచించారు. అనంతరం ప్రార్థనలో పాల్గొనారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా, డిసెంబర్ 23 : ఎర్రవల్లి చౌరస్తా మండలంలోని సరస్వతి పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌కట్ చేసి క్రిస్మస్ వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి డైరెక్టర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ మధులిక రెడ్డి, ప్రిన్సిపాల్ నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

అమరచింత, డిసెంబర్ 23 : పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీలో సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకులు శ్యాంసుందర్, ఆజయ్ ఆధ్వర్యంలో డెబ్బై మంది ఒంటరి మహిళలు, వృద్ధులకు స్థానిక ఎంబీ చర్చి ఫాస్టర్ హ్యాపీపాల్ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అరుణ్‌కుమార్, విజయ్, సీఐటీయూ నాయకులు బుచ్చన్న ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంపై చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు బీఆర్ఎస్‌వీ నేతల వినతి

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కుర్వ పల్లయ్య

అయిజ, డిసెంబర్ 23 : మండలంలోని పులికల్ గ్రామంలో ఐకేపీ ధాన్యం కొను గోళ్లలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బీఆర్ఎస్‌వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో పులికల్ ధాన్యం కొనుగోలు కేంద్రంపై ఆయన ఫిర్యాదు చేశారు. 40కేజీల బస్తాకు 500 గ్రాముల వడ్లను మాత్రమే తీసుకోవాల్సి ఉండగా, క్వింటాకు 2కేజీల ధాన్యాన్ని అదనంగా సేకరించి రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు ఇచ్చినా పది రోజులైనా గన్నీ బ్యాగులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గన్నీ బ్యాగులు నిల్వ చేశారని అదనపు కలెక్టర్‌కు వివరించారు. అయిజ ఏపీఎం, సీసీలు కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని పల్లయ్య తెలిపారు. తక్షణమే పులికల్ ధాన్యం కొనుగోలు కేంద్రంపై సమగ్ర విచారణ చేసి, రైతుల నుంచి అదనంగా సేకరించి 2 కేజీల ధాన్యం రైతుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవడం తోపాటు అవకతవకలకు పాల్పడిన ఏపీఎం, సీసీలు, మహిళా సమాఖ్యపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రైతులు ఉన్నారు.

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న మహిళా సంఘాల నాయకురాళ్లు

పెబ్బేరు, డిసెంబర్ 23 : పెబ్బేరు మున్సిపాలిటీలోని రెండో వార్డు కౌన్సిలర్ అక్కమ్మపై చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన స్వార్థం కోసం ఇటీవల మహిళా సంఘం భవనాన్ని కూల్చివేశారని వారు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పజెప్పారని, ఎన్నికలు జరిగిన సంఘాలను అక్రమంగా తొలగిస్తున్నారని వారు తెలిపారు. మహిళా సంఘాలపై పెత్తనం చెలాయిస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. సమావేశంలో అక్కల జ్యోతి, బొజ్జమ్మ, కవిత, కథలమ్మ, పార్వతి, మహేశ్వరమ్మ, నస్రీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గద్వాలటౌన్, డిసెంబర్ 23 : ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగులకు న్యాయం చేయాలని రైతు బంధు సమితి జిల్లా సమన్వయ కర్త వెంకట్రామిరెడ్డి అన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని స్మృతివనం వద్ద చేపట్టిన నిరసన సోమవారానికి 14వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. అలాగే మహిళా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు జిల్లా రైతు సంఘం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మద్దతును తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, డీపీవో, డీఏ ఓంటి, సీసీవో, సీఆర్‌పీ, పీటీఐ విభాగాల అధ్యక్షులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : భారత మాజీ ప్రధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పీవీ నరసింహారావు చిత్రపటానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 23 : భారతచరిత్రలో గొప్ప నాయకుడు పీవీ నర్సింహరావు అని స్థానిక నాయకుడు వెంకటేశ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి చౌరస్తాలో పీవీ నర్సింహరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, రుక్మానంద రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటన్న, శాంతన్న, రాజ్‌కుమార్, వెంకటేశ్, బలరాం, నారాయణ, రాముడు, ఈదన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆశల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

గద్వాలటౌన్, డిసెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం ఆశల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ఆరోపించారు. ఆశల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర సోమవారం జిల్లాకు చేరుకున్నది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ ఆశలకు ఫిక్స్‌డ్ వేతనం కింద రూ.18వేలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిందని, ఆ హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి సునీత, రాష్ట్ర నాయకురాలు బాలమణి, పద్మ, సాధన, గంగమణి, నీలాదేవి పాల్గొన్నారు.

కొత్తకోటకు చేరుకున్న 'ఆశ' ల బస్సు యాత్ర

కొత్తకోటకు చేరుకున్న ఆశ వర్కర్ల రాష్ట్ర నాయకురాళ్లకు స్వాగతం పలుకుతున్న ఆశవర్కర్లు, నాయకులు

కొత్తకోట, డిసెంబర్ 23 : ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆశవర్కర్ల బస్సు యాత్ర సోమవారం కొత్త కోటకు చేరుకున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బొబ్బిలి నిక్సన్ పాటు స్థానిక ఆశ వర్కర్లు భాగ్య, సంతోష, పుష్ప, వరలక్ష్మి, పావని, భాగ్య, లక్ష్మి, గీత, చిన్నమ్మ వారికి చౌరస్తాలో స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలపై చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆశలకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన, నేటికి అమలు చేయలేదని మండిపడ్డారు. రోజు రోజుకు నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయని దానికి అనుగుణంగా ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆశ కార్యకర్తలు నిర్మలాదేవి, సునీత, సాధన, పద్మ, బాలమణి పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

బాధితుల సమస్యలపై దృష్టి సారిస్తాం

- కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, డిసెంబర్ 23 : ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస రావు, అధికారులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మానవపాడు, డిసెంబర్ 23 : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జగ్గుల శివరాజు కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.22వేల ఆర్థిక సాయాన్ని సోమవారం స్నేహితులు మృతుడి కుటుంబానికి అందజేశారు. జగ్గుల శివరాజుతోపాటు మానవపాడు ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి చదివిన మిత్రులందరూ కలిసి తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని రూ.22వేల నగదును మృతుడి భార్య సంగీతకు అందజేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

- డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్
- బాలుర ఖోఖో క్యాంప్ సందర్శన

జిల్లాస్థాయికి ఎంపికైన బాలుర ఖోఖో క్రీడాకారులతో డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్

అయిజ, డిసెంబర్ 23 : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్ బాలుర ఖోఖో క్రీడాకారులకు సూచించారు. సోమవారం అయిజ పట్టణంలోని బ్రైట్‌స్టార్ పాఠశాలలో బాలుర ఖోఖో క్రీడాకారులకు ఏర్పాటు చేసిన క్యాంప్‌ను ఆయన సందర్శించారు. క్యాంపులోని క్రీడాకారులు పీడీలు, పీఈటీలు ఇస్తున్న శిక్షణలో ఆటతీరును మెరుగుపర్చుకొని సీఎం కప్ రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. పీఈటీ సుబ్బన్న విద్యార్థులకు ఖోఖోలో చక్కటి శిక్షణ ఇస్తుండడం గర్వకారణమన్నారు. అనంతరం శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు, వసతులు కల్పించిన బ్రైట్ స్టార్ కరస్పాండెంట్‌ను ఆయన అభినందిస్తూ శాలువాతో సన్మానించి, మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బషీర్, పీడీ నర్సింహరాజు, పీఈటీలు రఘు, సుబ్బన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 23 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి సిద్దార్థ్ సీఎం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థి అథ్లెటిక్స్ విభాగంలో కిక్ బాక్సింగ్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. అనంతరం విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీడీ చందర్ అభినందించారు.

విద్యకు జీడీపీలో 6శాతం కేటాయించాలి

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : విద్యకు జీడీపీలో ఆరు శాతం బడ్జెట్ కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యను ప్రజలకు ఉచితంగా అందుబాటులో అందించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యకు అధిక నిధులు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయా పాఠశాలలో మౌలిక కల్పనకు రూపకల్పన చేయాలని అన్నారు. వీటిని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డీ అమిద్, జ్యోతి, జిల్లా కోశాధికారి వెంకటేశ్, ఎంఈవోలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులు, కవి జనజ్వాల, రాజారాంప్రకాశ్, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, వెంకటేశ్, అరుణ, అనసూయ, అశ్విని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు